క్లుప్తంగా

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా ఉప వైద్యాధికారి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో డెలివరీలు ఏ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ భూషణ్ ఉన్నారు.

హనుమాన్ భక్తులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్ గౌడ్

మల్యాల: కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల్లో శంబల నగరి సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్ మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ, చల్లని నీటి పంపిణీ చేయడాన్ని చంద్రశేఖర్ గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, శంబల నగరి సభ్యులు లత, పూర్ణ, చంద్రకళ, కిరణ్మయి, ఆలయ డైరెక్టర్ లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం సభ్యులు సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శనివారం ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు విన్నవించారు. సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చిన్నారెడ్డి, చుక్కబొట్ల నర్సయ్య, మహేశ్, రమేశ్ కరుణకార్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దెశెట్టి జీవన్ పాల్గొన్నారు.

చెత్తపై అవగాహన అవసరం

జగిత్యాలరూరల్: గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీపై మహిళల్లో అవగాహన పెరగాలని కర్నాటకకు చెందిన డాక్టర్ శాంతి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ లోని మహిళా సంఘం సభ్యులకు తడి చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ ఎరువులపై ఆన్‌లైన్ ద్వారా శనివారం అవగాహన కల్పించారు. ఐకేపీ ఏపీఎం గంగాధర్, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ నలువాల సునీత, ఉప సర్పంచ్ పన్నాల రఘు, వీవోఏలు రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు నరేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం


ధాన్యం పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో ఇంటర్, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం ఘనంగా సన్మానించారు. ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన మొగిలి జ్యోతిర్మయిని, 10వ తరగతిలో సున్నం సంజన 9.8 జీపీఏ సాధించడంతో వీరిని పలువురు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం నవ్యశ్రీ,యామాపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, ఉప సర్పంచ్ అసతి పెద్ద రాజం, నాయకులు పాల్గొన్నారు.





కిడ్స్.. 'ట్రెండ్స్'

- యూట్యూబ్‌లో రాణిస్తున్న చెర్లకొండాపూర్ వాసులు
- 16 లక్షల సబ్‌స్క్రైబర్లు
- ఆకట్టుకుంటున్న షార్ట్‌ఫిల్మ్స్ వీడియోలు



వీడియో చిత్రీకరణ, యూట్యూబ్ నుంచి వచ్చిన అవార్డుతో వెంకటేశ్, కన్నయ్య

రాయికల్: ట్రెండ్స్ అడ్డా అనగానే చిన్నారులకు గుర్తుకొచ్చేది కన్నయ్య. ఆ పదేళ్ల బుడతడు యూట్యూబ్‌లో నటించిన షార్ట్‌ఫిల్మ్‌లకు చిన్నారులంతా మంత్రముగ్ధులవుతూ ఫోన్లకే అతుక్కునే పరిస్థితి. చిన్నపిల్లలు సైతం మారాం వేసిన సమయంలో యూట్యూబ్‌లో కన్నయ్య ప్రోగ్రాం చూస్తూ భోజనం తింటున్నారంటే అతిశయోక్తి కాదు. రాయికల్ మండలం చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన మానాల వెంకటేశ్, భార్య రమకు ఇద్దరు కుమారులుండగా మొదటి కుమారుడు నాగచరణ్ (కన్నయ్య), రెండో కుమారుడు వరుణ్‌సాయి ఉన్నారు. వీరితో పాటు గ్రామానికి చెందిన నవీన్, మహేశ్, నరేశ్, సంతోష్, గంగు, అక్కి, సమ్మలతో కలిసి 'ట్రెండ్స్ అడా' పేరుతో యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేశారు.

16 లక్షల సబ్‌స్క్రైబర్లు

ట్రెండ్స్ అడ్డా యూట్యూబ్ ఛానల్‌ను 2017లో మొదలు పెట్టగా మొదట్లో సబ్‌స్క్రైబర్లు తక్కువగా ఉండటంతో డైరెక్టర్, ఎడిటర్, స్క్రిప్ట్ రైటర్ మానాల వెంకటేశ్ తన యూట్యూబ్ చానల్‌ను గ్రామీణ ప్రాంతంలోని చిన్నారులకు, గ్రామీణ ప్రజలకు దగ్గర కావడం కోసం చాలా ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రాలేదు. 2022లో తన పెద్ద కుమారుడు నాగచరణ్‌తో పాటు తన భార్య రమతో పాటు కుటుంబ సభ్యులు కలిసి చిన్నపిల్లలకు దగ్గరయ్యేలా షార్ట్‌ఫిల్మ్‌లను రూపొందించారు. ఇందులో ఎక్కువగా అమ్మ కుక్క కావాలి, పెళ్లి చూపులు, అమ్మ పులి బొమ్మ కావాలి, కన్నయ్య స్పైడర్‌మ్యాన్, సంక్రాంతి ముగ్గుల పోటీ, చద్ది ఇచ్చి రమ్మంటే, శివయ్యల రెడీ అయితే వంటి షార్ట్‌ఫిల్మ్‌లకు సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరిగిపోయింది. 2022 నుంచి నేటి వరకు 385 షార్ట్‌ఫిల్మ్‌లు చిత్రీకరించినట్లు వెంకటేశ్ తెలిపారు. ముఖ్యంగా కన్నయ్య నటించిన షార్ట్‌ఫిల్మ్ వీడియోలకు చిన్నపిల్లలంతా ఎక్కువగా ఆసక్తి చూపడంతో ట్రెండ్స్ అడ్డా గతంలో 10 లక్షలు దాటిపోవడంతో యూట్యూబ్ నుంచి అవార్డులు సైతం అందుకున్నారు.

సండే స్పెషల్

ట్రెండ్స్ అడ్డాతో 16 లక్షల సబ్‌స్క్రైబర్లు



ట్రెండ్స్ అడ్డా యూట్యూబ్ ఛానల్‌ను 2017లో ప్రారంభించాం. 2022 వరకు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ సబ్‌స్క్రైబర్లు పెరగకపోవడంతో చిన్నపిల్లలను ఆకట్టుకునేందుకు నా కుమారుడైన కన్నయ్య, వరుణ్‌సాయి, మరికొంత మంది సభ్యులతో కలిసి 10–15 నిమిషాల వరకు ఉండేలా షార్ట్‌ఫిల్మ్‌లను రూపొందించాం. యూట్యూబ్‌లో ఎంతో ఆదరణ ఉండటంతో సెలవుల్లో మరిన్ని షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందిస్తున్నాం.

– మానాల వెంకటేశ్, డైరెక్టర్, స్క్రిప్ట్ రైటర్, ట్రెండ్స్ అడ్డా యూట్యూబ్ ఛానల్

మంచి పేరు వచ్చింది



ట్రెండ్స్ అడ్డా యూట్యూబ్ ఛానల్‌లో మా అమ్మ నాన్న చెప్పినట్లు నటిస్తున్నాను. నేను ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేశాను. సెలవుల సమయంలో యూట్యూబ్‌లో షార్ట్‌ఫిల్మ్‌లు మా ఊరి పరిసర ప్రాంతాల్లో తీయడంతో మంచి ఆదరణ వచ్చింది. నన్ను చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. – కన్నయ్య

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ


టీ షర్టులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో నిర్వహించే సీఎం కప్ వాలీబాల్ పోటీలకు క్రీడాకారులకు శనివారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఒడ్డె లింగాపూర్ సర్పంచ్ రవిగౌడ్, నాయకులు మర్రిపల్లి శ్రీనివాస్‌గౌడ్, భూక్య తిరుపతి, అంగోతు తిరుపతి పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి:మండల కేంద్రంలో ఈ నెల 14 నుంచి ఏర్పాటు చేస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వోరుగంటి రమణారావు జాతీయ స్థాయి క్రీడాకారుల ఆధ్వర్యం లో శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉదయం 6 నుంచి 9, సాయంత్రం 5 నుంచి 7 వరకు శిక్షణ ఉంటుందని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు.

జూనియర్ కళాశాలకు బోరు, మోటారు మంజూరు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చడానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ.1.50 లక్షలతో బోరు, విద్యుత్ మోటారు మంజూరు చేసారని మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్ తెలిపారు. త్వరలో కళాశాలల్లో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోంద్ర రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


వాటర్‌కూలర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్టీసీ బస్‌డిపోలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు కోరగానే వారి సౌకర్యార్థం వాటర్ కూలర్ అందించామని, ఆర్టీసీని మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రతి ఒక్క ఉద్యోగులు ప్రయత్నించాలన్నారు. ఇప్పటికే కరోనాతో ఆర్టీసీ తీవ్రంగా దెబ్బతిందని, ఇప్పుడిప్పుడే కొంత ఆదాయం మెరుగ్గా ఉందన్నారు. బస్టాండ్ ఆవరణలో పచ్చదనంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆర్టీసీ అభివృద్ధికి ఎలక్ట్రికల్ బస్‌లు, కార్గో సేవలు ఇలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డిపో మే నేజర్ నర్సప్ప,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు కోత విధిస్తే అధికారులకు ఫిర్యాదు చేయండి

రాయికల్: రైస్‌మిల్లర్లు అక్రమంగా ధాన్యంలో కోత విధిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. రాయికల్, కుమ్మరిపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని అన్నారు. అనంతరం వీరాపూర్‌లో మురుగునీటి కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచులు పాల్గొన్నారు.

హన్మాజీపేటలో ఎమ్మెల్యే పల్లెనిద్ర

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పల్లెనిద్ర చేశారు. స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పల్లెనిద్రలో భాగంగా ఆదివారం ఉదయం కండ్లపల్లి, చెర్లపల్లి గ్రామాల్లో కూడా పర్యటించనున్నట్లు నాయకులు తెలిపారు.

పదిమందిని కలుస్తూ... ఫలితాలు వివరిస్తూ..


విద్యార్థుల తల్లితండ్రులను కలిసి అధ్యాపకులు

సారంగాపూర్: ఉత్తమ ఫలితాల సాధనలో సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలో అగ్రస్థానంలో ఉందని, పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మా కళాశాలలో చేరాలని కళాశాల అధ్యాపకులు శనివారం మండలంలోని పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి, కోనాపూర్ గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 96.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఉన్నత చదువులు అందిస్తున్న కళాశాలలో ప్రభుత్వం నుంచి రాయితీలతో పాటు, కళాశాలలో ఉన్న వసతులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మచ్చ శంకర్, అధ్యాపకులు రాజు, రాజేందర్, వెంకటేశ్వర్లు, సుజాత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శి సోనిది ప్రభుత్వ హత్యే'

మెట్‌పల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనిది ప్రభుత్వ హత్యేనని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యదర్శుల డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆందోళనతో కార్యదర్శులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యదర్శులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని, సోని కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పేద యువతి వివాహానికి చేయూత

మెట్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ ప్రాంతానికి చెందిన లక్షితకు ఇటీవల పెళ్లి కుదిరింది. పేద కుటుంబం కావడంతో పెళ్లికి ఆమె తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న స్థానిక ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు శనివారం పట్టుచీర, పుస్తెమెట్టెలు అందించారు. ఇప్పటి వరకు 40 మంది యువతుల వివాహానికి సాయం చేసినట్లు అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పిప్పెర నరేశ్, రాంప్రసాద్, రూపేశ్, రఘు తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ మృతి


మారుతి మృతదేహం

మల్లాపూర్: ఇసుక అక్రమ రవాణాకు పెద్దవాగు తీరానికి వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని రేగుంట శివారులో శనివారం జరిగింది. స్థానికుల వివరాలు.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన పూదరి నర్సాగౌడ్ వద్ద మహారాష్ట్రకు చెందిన దారంగుల మారుతి(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇసుక తీసుకురావాలని మారుతిని నర్సాగౌడ్ రేగుంట శివారులోని పెద్దవాగుకు పంపించాడు. ఈక్రమంలో ఇతర కార్మికులు ఇసుక నింపుతుండగా, ఒడ్డున వేచి ఉన్న మారుతికి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో కుప్పకూలిపోగా, ప్రమాదవశాత్తు మారుతి శరీరంలోకి కర్ర దిగడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ సంబరాలు


సారంగాపూర్‌లో నాయకుల సంబరాలు


కథలాపూర్‌లో..

కోరుట్ల/మెట్‌పల్లి/ధర్మపురి/సారంగాపూర్/కథలాపూర్/పెగడపల్లి/మల్యాల/రాయికల్/ఇబ్రహీంపట్నం: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో, నియోజక వర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు టపాసులు పేల్చుతూ సంబురాలు చేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాలు, పట్టణాల అధ్యక్షులు, ప్రజాపతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోరుట్లలో టపాకాయలు పేల్చుతూ సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి


పోటీలు ప్రారంభిస్తున్న ముత్తయ్య

జగిత్యాల: గెలుపోటములు సమానంగా తీసుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వివేకానంద స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీల కోసం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికపోటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఎక్కువగా పాల్గొన్నారని, ఈ పోటీల్లో రన్నింగ్ 100 మీటర్లు, 200, 400, 800, 3 కి.మీ, 5 కి.మీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వీటిలో ప్రతిభ కబనర్చిన వారు ఈనెల 27, 28న ఖమ్మం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మల్లాపూర్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో శనివారం మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ కార్యకర్తల కష్టానికి దక్కిన ఫలితమే ఈ ఘన విజయమన్నారు. కర్ణాటకలో బీజేపీ మతవిద్వేషాలతో, ధనబలంతో గెలవాలన్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర మొదటి ఫలితమే కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో నియంతల్లాగా పాలన చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో బీరప్ప ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా ఊరేగింపుగా దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, చిట్యాల మహేశ్, ఆకుల నర్సయ్య, చెక్కపెల్లి రాజుకుమార్, ఏజీబీ మహేందర్, కల్లెడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమన్న విగ్రహ ఊరేగింపు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో భీమన్న ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసే భీమేశ్వర స్వామి విగ్రహాన్ని శనివారం గ్రామంలో ఊరేగించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చనలు అభిషేకాలు, పుణ్యాహావచనం, గణపతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, నాయకులు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



సాయి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ 32 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాయి నాథునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పల్లకీ సేవా వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.